మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి గ్రామంలో గల రఘు ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్డిపిఎస్ 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు గంజాయి, హెరాయిన్, కొకైన్ వంటి మాదకద్రవ్యాలు వాడటం వలన వచ్చే నష్టాలు, వాటి దుష్ప్రభావాలు గురించి భీమునిపట్నం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సబ్ ఇన్స్పెక్టర్ చిన్నమనాయుడు, సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్ వండా, అధ్యాపకులు, విద్యార్థులు, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో హైడ్రామా

అధికారిక ఉత్తర్వులు లేకుండా అశోక్ కుమార్ జాయినింగ్‌పై గందరగోళం

గంట పాటు నిరీక్షించి వెనుదిరిగిన అశోక్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: గత 2 నెలలు రోజుల క్రితం లైంగిక ఆరోపణలు ఎదుర్కొని, పోలీస్ కేసుతోపాటు వలు విచారణలు ఎదుర్కొన్న కేజీహెచ్ పూర్వపు సూపరింటెండెంట్ అశోక్ కుమార్ సోమవారం మళ్లీ హఠాత్తుగా కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా జాయినింగ్ వ్యవహారంపై కేజీహెచ్‌లో గందరగోళం నెలకొంది. ఒక్కసారిగా కేజీహెచ్ వైద్యులు, అధికారులు, ఉద్యోగులు గందరగోళానికి గురయ్యారు. గత రెండు నెలలుగా సూపరింటెండెంట్‌గా కొనసాగుతున్న డాక్టర్ శివానంద్ ఉంటుండగా మళ్లీ అశోక్ కుమార్ రావడంపై సోమవారం పెద్ద ఎత్తున వైద్య వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ చేయాల్సి ఉండగా, నేరుగా వచ్చి ఇక్కడ జాయిన్ అవ్వడం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తాయి. గత సూపరింటెండెంట్‌గా ఉంటూ కేసుల నేపథ్యంలో అశోక్ కుమార్ సెలవుపై వెళ్లడంతో తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు డాక్టర్ శివానంద్ కేజీహెచ్‌కు సూపరింటెండెంట్‌గా కొనసాగాలంటూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. తాజాగా ఎలాంటి ఉత్తర్వులు లేకుండా అశోక్ కుమార్ నేరుగా వచ్చి జాయిన్ కావడంపై ఏం చేయాలో తెలియక గందరగోళంలో పడి కేజీహెచ్ ఉన్నతాధికారులు వివరణ కోరుతున్నట్లు తెలిసింది. ఏదైనా ఉద్యోగి చిన్న తప్పు చేస్తే నానా హడావుడి చేసే డిఎంఈ అధికారులు ఈ విషయంపై నోరు మెదకపోవడం వల్ల అవినీతి, ఆరోపణలు ఉన్నాయంటూ పలువురు చర్చించుకుంటున్నారు. డ్రాయింగ్ ఆఫీసర్ హోదాలో 14 రోజులు సెలవు పెడితే ఖచ్చితంగా ఉన్నత అధికారులు అనుమతి తీసుకోవాల్సి ఉందని, అలా కాకుండా రెండు నెలలు సెలవుల్లో ఉన్న వ్యక్తికి రీ పోస్టింగ్ ఆర్డర్ లేకుండా నేరుగా వచ్చి ఎలా జాయిన్ అవుతారంటూ కేజీహెచ్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కనీసం డిపార్ట్మెంటల్ ఎంక్వయిరీ కూడా లేకుండా రీ పోస్టింగ్ ఎలా ఇస్తున్నారన్న విషయంపై నోరు మెదపని డిఎంఈ అధికారులు వైఖరి పై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం ఏదో ఒక వివాదాల్లో ఉంటున్న కేజీహెచ్ ఆస్పత్రి మరోసారి వివాదాలకు కేంద్రంగా మారిపోయింది.

ప్రజా ప్రతినిధులు, స్థానిక ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నా మళ్లీ అదే వ్యక్తికి కీలకమైన కేజీహెచ్‌లో సూపరింటెండెంట్‌గా నియమించడంపై పెద్ద ఎత్తున ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

జాయినింగ్ ఆర్డర్ లేకుండా ఎట్టి పరిస్థితుల్లో చేర్చుకోనంటూ ప్రస్తుత ఇన్చార్జి సూపరింటెండెంట్ శివానంద్ తేల్చి చెప్పినట్లు తెలిసింది. ఇదే అంశంపై డిఎంఏకి కేజీహెచ్ అధికారులు వివరణ కోరినట్లు సమాచారం. గంటపాటు వెయిట్ చేసి బయటకు వెళ్ళి పోయిన పాత సూపరింటెండెంట్ అశోక్ కుమార్ వ్యవహారంపై కేజీహెచ్‌లో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది.

ఆదర్శ్‌లో లింగ సమానత్వ సదస్సు

విశాలాంధ్ర - పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కాలేజీలో లింగ సమానత్వ అవగాహన సదస్సు నిర్వహించినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్ఈ ఫ్లోరా తెలిపారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా సోషల్ వర్కర్, ఆంధ్ర యూనివర్సిటీ హ్యూమన్ రైట్స్ సభ్యురాలు జి.కోమలి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుతం ట్రాన్స్ జెండర్స్ వివిధ రంగాల్లో రాణిస్తున్నారని వివరించారు. లింగం అనేది మెదడుకు సంబంధించిందని, సెక్స్ అనేది జీవంకు సంబంధించిందని వెల్లడించారు. ఈ అవగాహన సదస్సులో మానవ శరీరంలో హార్మోన్స్ ఇన్ బ్యాలెన్స్, ట్రాన్స్ జెండర్లు పడుతున్న ఇబ్బంది, దీనిపై ప్రజల్లో అవగాహన రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆదర్శ్ కాలేజ్ కరస్పాండెంట్ టి.థియోఫిలోస్ మాట్లాడుతూ లింగ సమానత్వం గురించి తెలియకపోవడం తప్పు కాదని, తెలుసుకోకపోవడం తప్పని తెలుసుకోవడానికి అవకాశం వచ్చినప్పుడు తెలుసుకోవాలని సూచించారు. సదస్సులో విద్యార్థులు అధ్యాపకులు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేశారు.

నెల రోజులపాటు వరలక్ష్మీ వ్రతాలు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి స్వామివారి బేడా మండపంలో కొలువు తీరిన సింహవల్లి తాయార్ సన్నిధిలో నెలరోజుల పాటు వరలక్ష్మీ వ్రతాలు రూ.300/- రుసుంతో నిర్వహిస్తున్నట్లు ఈఓ ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈ వ్రతాలు ప్రతి రోజూ ఉదయం గం. 7ల నుండి గం.9ల వరకు జరుగుతాయని ప్రధాన అర్చకులు గోడవర్తి శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఈ సదావకాశాన్ని మహిళా భక్తులు ఉపయోగించుకోవాలని ఈఓ కోరారు.

గంటాతో టీడీపీ ఇన్‌చార్జి సత్య భేటీ

స్థాయి సంఘం, ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో టీడీపీ ఇన్‌చార్జి దామచర్ల సత్య సోమవారం ఎం.వి.పి. కాలనీలోని గంటా శ్రీనివాసరావు నివాసంలో భేటీ అయ్యారు. జిల్లాలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల గురించి ఇద్దరూ కొంతసేపు ముచ్చటించారు. జీవీఎంసీ స్థాయి సంఘం ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలుచుకునేలా పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి ఆసక్తి చూపుతున్న అభ్యర్థుల గురించి, విజయం సాధించడానికి ఏ రకంగా ముందుకు వెళ్లాలనేది చర్చించారు. గెలుపే లక్ష్యంగా ఈ రెండు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహ ప్రతివ్యూహాలను చర్చించారు. స్థాయి సంఘం ఎన్నికల్లో 10 స్థానాలకు పోటీ చేయబోయే అభ్యర్థులను ఇప్పటికే ఖరారు చేయగా బుధవారం ఎన్నిక జరగనుంది. టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయడానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, మాజీ ఎమ్మెల్యేలు పీలా గోవింద సత్యనారాయణ, ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడ్డ కోరాడ రాజబాబు, ఖైరా దిలీప్ చక్రవర్తి, తాతయ్య బాబు, ప్రగడ నాగేశ్వరరావు తదితరులు ఆసక్తి చూపుతున్న విషయం తెలిసిందే. ఈ రెండు ఎన్నికల్లో విజయం సాధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు బహుమతిగా ఇవ్వాలన్నారు.

గంటాను కలిసిన స్థాయి సంఘం అభ్యర్థులు

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును స్థాయి సంఘం చైర్మన్లుగా పోటీ చేస్తున్న పి.వి.నరసింహం, బొమ్మిడి రమణ, బల్ల శ్రీను, గొలగాని వీరారావు, విల్లూరి భాస్కరరావు, నొల్లి నూకరత్నం కలిశారు. అత్యధిక మెజారిటీతో పది చైర్మన్ పదవులను దక్కించుకోవాలని గంటా అన్నారు. విజయం సాధించడానికి అనుసరించాల్సిన వ్యూహాన్ని అభ్యర్థులతో చర్చించారు. గంటా శ్రీనివాసరావును కలిసిన వారిలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, టీడీపీ నాయకులు గంటా నూకరాజు, మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకట్రావు తదితరులు ఉన్నారు.

త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలోని గొట్టిపల్లి, చందక గ్రామాల్లో నిర్మితమవుతున్న గృహ నిర్మాణాలను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తిచేయాలని గుత్తేదారులకు, అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. నిర్మాణాలకు అవసరమైన ఇసుక, సిమెంట్, నీటి సరఫరా కొరత లేకుండా చూస్తామని, రానున్న 3 మాసాల్లో నిర్మాణాలు పూర్తికావాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం ఉదయం విశాఖ రూరల్, భీమిలి, ఆనందపురం మండలాల్లో జిల్లా కలెక్టర్ పర్యటించారు. ఆనందపురం మండలం గొట్టిపల్లి రెవెన్యూ గ్రామంలోని సర్వే నెంబర్ 20, 23 చందక గ్రామంలోని సర్వే నెంబర్ 1లో వేసిన గృహ నిర్మాణాల లే అవుట్ పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలోని గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని గుత్తేదారులను, గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణాలకు సిమెంట్ కొరత లేదని, నీటి సరఫరా, ఇసుక సమస్యను పరిష్కరిస్తామని గుత్తేదారులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. పర్యటనలో గృహ నిర్మాణ శాఖ పీడీ డి.అఖిల, గనుల శాఖ డీడీ డా. డిఇవిఎస్ఎస్ఎన్ రాజు, మండల తహసీల్దార్ శ్యాం ప్రసాద్, ఎంపీడీఓ అప్పలనాయుడు, ఈఈ సత్యనారాయణ, డీఈలు రామకృష్ణ, సూర్యప్రకాశ్, సీతారాం, ఏఈ సూర్యప్రకాశరావు, ఇతర ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్వోలు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

బొత్సతో కార్పొరేటర్ ముమ్మన భేటీ

విశాలాంధ్ర - పెందుర్తి: మాజీ మంత్రి బొత్స సత్యనారాయణతో జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్, వైసీపీ పెందుర్తి నియోజకవర్గం సీనియర్ నాయకుడు ముమ్మన దేముడు భేటీ అయ్యారు. సబ్బవరం మండలం వైసీపీ అధ్యక్షులు కర్రి బాబు, సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ ధెడ్డం ప్రసాద్, సియ్యాద్రి బాల చంద్ర, యర్రంశెట్టి రాము, యువజన విభాగం అధ్యక్షులు యడ్ల నాయుడు, మొగలిపురం ఉప సర్పంచ్ సిరపరపు వాసు, గురి శ్రీనివాస్, కరక రాము, గొలగాని రమేష్ తదితరులతో కలిసి నగరంలోని బొత్స నివాసంలో ఆయన్ను కలిసి పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్స పేరును పార్టీ అధినేత జగన్ ప్రకటించడంతో దానిపై చర్చించారు.

వ్యాపారస్తులకు అనుగుణంగా

బీఆర్టీఎస్ రోడ్ ప్లాన్ మార్చేశారు

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 98వ వార్డ్ పాత గోశాల నుండి పాత అడవివరం వరకు రెండు కిలోమీటర్ల బీఆర్టీఎస్ రోడ్డు కాస్తా కొందరి వ్యాపారస్తుల స్వార్థంతో రెండు రోడ్లు ప్రధాన రహదారిగా మార్చటంతో వాహన చోదకులు, స్థానికులు మండి పడుతున్నారు. ముఖ్యంగా సింహాద్రినాధుని వార్షిక ఉత్సవాలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అధికారులు బీఆర్టీఎస్ రోడ్ నిర్మాణం వేగవంతం చేసిన సంగతి పాఠకులకు విధితమే. అధికారులు రాజకీయ ఒత్తిళ్ల వలన బీఆర్టీఎస్ వ్యవస్థను మార్చటం ఎంతవరకు సమంజసం అని స్థానికులు వాపోతున్నారు. అధికారిక రోడ్ ప్లాన్ ఇలా ఎవరికి నచ్చినట్లు వారు మార్చటం వలన భవిష్యత్‌లో ఎక్కువ ప్రమాదాలు జరగవని భరోసా ఉందా అంటే అదీ లేదు. భక్తులు, స్థానికులు తొలిపావంచా వద్ద రోడ్డు దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని దాటాల్సి వస్తుందని పాదచారులు అంటున్నారు. రోడ్డు వేస్తే కొందరికి లాభం. ఇకొందరికి నష్టం. రోడ్డు వేస్తే వ్యాపారాలు పెరుగుతాయని సంతోషించే వారు కొందరు అయితే రోడ్డు వలన ఉపాధి కోల్పోతున్న వారి బాధ ఎవరికీ పట్టదు. రోడ్లు వేయడం ప్రగతికి సంకేతాలుగా భావించి రాజకీయ నాయకులు ఎప్పటి నుంచో ఓట్లకోసం దీనిని తమ రాజకీయ అస్త్రంగా వాడుకుంటున్నారు. రోడ్డు బట్టి ప్రభుత్వ శాఖలకు బాధ్యతలు ఉన్నాయి. కొందరికే పరిమితం చేసే రోడ్డు మీద ప్రభుత్వ పెట్టుబడులు పెట్టడం కూడా ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య. రోడ్డు డిజైన్ కొందరు బడా వ్యాపారుల కోసం వారికి అనుగుణంగా మార్పు చేసుకుని రోడ్డు నిర్మించారని ఆరోపణలు ఉన్నాయి. ట్రాఫిక్ రద్దీ పెరుగుతుందనే ఆందోళనలో ప్రభుత్వం చూపుతున్న పరిష్కారం ఒకలా ఉంటే ఎవరికి నచ్చినట్లు వారు ప్లాన్ మార్చటం వలన స్థానిక ట్రాఫిక్ రద్దీ తగ్గకపోగా ఇంకా జటిలం కాక తప్పదు. రోడ్ల మీద ప్రభుత్వం పెట్టే ఖర్చు కూడా పెరుగుతుంది. రోడ్ల నిర్మాణం మీద, నిర్వహణ మీద పెడుతున్న ఖర్చు మీద ఆడిట్ ఉంటుందా అన్న సందేహాలు కలుగక తప్పదు. ఇదివరకు నిర్మించిన రహదారుల మీద కాగ్ నివేదికలు ఉంటే పరిశీలించాలి. రోడ్డు ఖర్చు మీద ఆడిట్ ఖర్చు గురించి ఎక్కడా చర్చ లేదు. ఎక్కడ రోడ్డు వేసినా అది ఏ లక్ష్యంతో వేస్తున్నారు? దాని వలన ప్రయోజనం ఎవరికి, అసలు దాని అవసరం ఉందా? నిర్వహణ ఖర్చుకి నిధులు ఎట్లా వస్తాయి? స్థానిక పర్యావరణం మీద దాని వలన ఉండే ప్రభావం వంటి అంశాలు అన్ని పరిగణనలోకి తీసుకునే వ్యవస్థ రావాలి. ఇవాళ ఎక్కడైనా రోడ్డు అంటే వ్యాపార వస్తువుగా మారిపోయింది తప్ప అవి ప్రజా రవణా రోడ్లు అనే అనుభూతి ఎక్కడా కనిపించటం లేదు.

1271వ రోజుకు ఉక్కు దీక్షలు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే దీక్షలు సోమవారానికి 1271వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి. ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్రం ఏకపక్ష వైఖరితో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నూటికి నూరు శాతం అమ్మాలని కుట్రలు పన్నడం దుర్మార్గమన్నారు. ఉక్కు కర్మాగారం ఏర్పాటు కోసం నిర్వాసితులు తమ విలువైన భూములను త్యాగం చేసారని గుర్తు చేశారు. ప్రజల సంపదను కొల్లగొట్టే హక్కు కేంద్రానికి లేదన్నారు. ఈ దీక్షల్లో ఏఐటీయూసీ నాయకులు డొక్కా నర్సింగరావు, కె.రాజ బాబు, తాండ్ర కనకరాజు, జి.జయ, ఏ.శివ రామ కృష్ణ, సీతా రామరాజు, చీకటి శ్రీనివాస్, డి.దేముడు, బి.ఎం.ఎల్.నాయుడు, జి.ఆనంద్, టీఎన్టీయూసీ నాయకులు విల్లా రామ్మోహన్ కుమార్, వీఎస్పీ ఈయూ నాయకులు కాండ్రేగుల శ్రీనివాస నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుపై వీఆర్వోలకు శిక్షణ

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎం.ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో మండలంలో ఉన్న ప్రతి గ్రామ రెవెన్యూ అధికారులకు ఈ పంట నమోదుపై శిక్షణ ఇవ్వడం జరిగింది. అలాగే కౌలు రైతులకు సిసిఆర్సి కార్డులు మంజూరుపై అవగాహన కల్పించారు. ప్రతి రైతు పండించే పంటను వీఆర్వోలు, వీపీఏలు కలిసి నమోదు చేయాలన్నారు. క్రాప్ బుకింగ్ చేయాలని సూచించారు. ముందుగా వీఆర్వోలు రైతుల సర్వే నెంబర్లను గుర్తించి ఆ వివరాలను గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలని అన్నారు. తద్వారా ఈ పంట నమోదు సవ్యంగా, వేగంగా చేయవచ్చునని సూచించారు. అర్హులైన కౌలు రైతులకు సిసిఆర్సి కార్డులు ఇవ్వాలని వీఆర్వోలకు సూచించారు. తద్వారా వారికి పంట రుణాలను బ్యాంకు వాళ్ళు ఇస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎంవిఎస్ చలం, ఉప తహశీల్దార్ యోగి, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

8న రిటైర్డ్ పెన్షనర్ల ధర్నా

విశాలాంధ్ర - పెదగంట్యాడ: పెదగంట్యాడ సిడబ్ల్యూసిలో ఆల్ పర్సనల్ రిటైర్డ్ పెన్షన్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కనితి అప్పలరాజు అధ్యక్షత వహించారు. ఢిల్లీలో 6, 7, 8 తేదీల్లో జంతర్ మంతర్ దగ్గర జరగనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. అలాగే జిల్లా అధ్యక్షులు కే.దేనిబంద్ మాట్లాడుతూ విశాఖపట్నం జీవీఎంసీ గాంధీ విగ్రహం దగ్గర ఈనెల 8వ తేదీన జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. మినిమం పెన్షన్ 9000 ఇవ్వాలని, డీఏ అనుగుణంగా ఇవ్వాలని, మెడికల్ సౌకర్యం కల్పించాలని, వైట్ రేషన్ కార్డు ఇవ్వాలని, ట్రైన్ చార్జీ 50% ఇవ్వాలన్న డిమాండ్‌తో ధర్నా చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాకినాడ పెంటారావు, సిసెట్టి అప్పారావు, బైరెడ్డి గురప్ప, దుర్గారావు, శెట్టి చిన్న సన్యాసిరావు, నక్క అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - పద్మనాభం: శ్రీనివాస సేవా సంఘం ఆధ్వర్యంలో పద్మనాభం మండలం రేవిడి పంచాయతీకి చెందిన రెల్లి సురేష్ అనే క్రీడాకారుడు అంతర్జాతీయ షూటింగ్ బాల్‌కు ఎంపికయ్యాడు. ఈ ఆగస్టు నెలలో నేపాల్‌లో జరిగే షూటింగ్ బాల్ క్రీడకు వెళ్తున్న సురేష్‌కు పలువురు దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేయుటలో భాగంగా పాండ్రంగి గ్రామమునకు చెందిన కూచిర్లపాటి రామరాజు క్రీడాకారుని ప్రోత్సహించి 5000 రూపాయలు ఇవ్వడం జరిగింది. వారికి శ్రీనివాస సేవా సంఘం ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస సేవా సంఘం సభ్యులు, పాండ్రంగి గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

గాజువాకలో మలబార్

గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూం ప్రారంభం

విశాలాంధ్ర - గాజువాక: గాజువాక ఆభరణాల ప్రేమికులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఆభరణాల షాపింగ్ అనుభూతిని అందించడానికి ప్రముఖ అంతర్జాతీయ ఆభరణాల వ్యాపార సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 4,800 చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యద్భుతంగా తీర్చిదిద్దబడిన షోరూం ప్రారంభోత్సవాన్ని అంగరంగవైభవంగా జరుపుకుంది. షోరూమ్‌ను సోమవారం గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గాజువాక ప్రజలకు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూం అందుబాటులోకి రావడం శుభ పరిణామం అన్నారు. మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి.అహమ్మద్ మాట్లాడుతూ గాజువాక ప్రజల కోసం అద్భుతమైన ఆభరణాల సేకరణలను ఆవిష్కరించడం తమకు చాలా ఆనందంగా ఉందన్నారు. హస్తకళా ప్రావీణ్యంతో, అత్యుత్తమ డిజైన్లతో, ప్రత్యేకంగా తయారుచేసిన తమ బ్రాండ్ల యొక్క విభిన్న ఆభరణాల ఎంపికలను ఈ షోరూము ప్రదర్శిస్తుందన్నారు. గాజువాక షోరూంలో మైన్ డైమండ్ జ్యూవెలరీ, ఎరా అనకట్ డైమండ్ జ్యువెలరీ, డివైన్ హెరిటేజ్ జ్యువెలరీ, ఎథ్నిక్స్ హ్యాండ్ క్రాఫ్టెడ్ జ్యువెలరీ, ప్రెసియా జేమ్ స్టోన్ జ్యువెలరీ, విరాజ్ పోల్కి జ్యువెలరీ వంటి మలబార్ ప్రత్యేక బ్రాండ్లతో పాటు, వివిధ సందర్భాలు వేడుకలకు సరిపోయే బంగారం, వజ్రాలు, పోల్కి, విలువైన రత్నాలు, వెండి, ప్లాటినం ఆభరణాల యొక్క విస్తృత శ్రేణి సేకరణలు ఈ మలబార్ షోరూములో లభిస్తాయని స్టోర్ నిర్వాహకులు చెప్పారు. ప్రతి కొనుగోలుతో ఉచిత వెండి నాణేన్ని ఆఫర్‌గా అందిస్తున్నామని, ఆగస్టు 18 వరకు మాత్రమే ఈ రాయితీ అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ మహ్మద్ రఫీ, జాన్సన్, మలబార్ స్టోర్ ప్రతినిధులు షరీజ్, పీకే సిరజ్, కే.శానిబ్ తదితరులు పాల్గొన్నారు.

వరిపొలాలను సందర్శించిన వ్యవసాయాధికారి



విశాలాంధ్ర - భీమిలి: సింగనబంద గ్రామంలోని ఉడుపులు అవుతున్న వరిపొలాలని భీమిలి మండల వ్యవసాయాధికారి శివ కోమలి సందర్శించారు. వరి రకాల కాలపరిమితిని బట్టి చదరపు మీటర్‌కి కుదుళ్ళ సంఖ్యను నిర్ధారించుకోవాలని సూచించారు. ఉడుపు చేసేముందు వారి నారు చివర్లను సమానంగా త్రుంచటం ద్వారా గ్రుడ్డు దశలో ఉన్న ఆకుముడత పురుగు, కాండం తొలిచే పురుగులను నివారించుకోవచ్చుని దీని వల్ల ప్రధాన పొలంలో 20 రోజుల వరకు ఈ పురుగుల తాకిడి ఉండదని తెలిపారు. ప్రధాన పొలంలో ఊద, ఏక వార్షిక గడ్డి జాతి మొక్కల నివారణకు ఉడిచిన 3-5 రోజుల్లోపు పలచగా నీరు పెట్టి 500 మిల్లి లీటర్ల ప్రెటిలక్లోర్ 50% మందును 25 కేజీల పొడి ఇసుకలో కలిపి సమానంగా వెదజల్లాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది హరీష్, రమేష్ పాల్గొన్నారు.

పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరణ

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ పట్నాయక్‌కు అదే పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న పెద్దింటి త్రినాధరావు మాస్టారు పిల్లలలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించే 50 పుస్తకాలను జనవిజ్ఞాన వేదిక తరపున పాఠశాల గ్రంథాలయానికి అందజేసారు. వాటివిలువ సుమారుగా 1500 రూపాయలు ఉంటుందని తెలిపారు.

పెందుర్తి పోలీస్ స్టేషన్ సందర్శించిన డీసీపీ తుహిన్ సిన్హా

విశాలాంధ్ర - పెందుర్తి: డీసీపీ-2 తుహిన్ సిన్హా పెందుర్తి పోలీస్ స్టేషన్‌ను సోమవారం సందర్శించారు. సిబ్బందితో మాట్లాడి పనితీరు మెరుగపరుచు కోవాలని సూచించారు. స్టేషన్ రికార్డులు పరిశీలించి త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం గంజాయి అక్రమ రవాణాకు ముఖ ద్వారంగా ఉన్న సరిపల్లి, పినగాడి ప్రాంతాలను పరిశీలించి గంజాయిపై ఉక్కుపాదం మోపాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సిఐ ఎల్.రమణ, ఎస్సైలు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ ఉప ఎన్నికల
నోటిఫికేషన్ విడుదల

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఉప ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ ఈనెల 6న విడుదల కానుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులకు తెలిపారు. నోటిఫికేషన్ జారీ నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుందని, 13వ తేదీ వరకు కొనసాగుతుందని (ప్రభుత్వ సెలవు దినములు మినహా) కలెక్టర్ చెప్పారు. ఎమ్మెల్సీ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రక్రియపై సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ ఉదయం 11.00గం.ల నుంచి మధ్యాహ్నం 03.00గం.ల వరకు ఉంటుందని తెలిపారు. ఈ ఎన్నికల్లో విశాఖ జిల్లాతో పాటు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన జెడ్.పి.టి.సిలు, ఎం.పి.టి.సిలు, మునిసిపాలిటీ సభ్యులు ఓటరుగా పాల్గొననున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారిగా, జాయింట్ కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా, జిల్లా రెవిన్యూ అధికారి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికలకు సంబంధించిన ప్రకటన గత నెల 30న విడుదల అయిందని, అప్పటి నుంచే ఎన్నికల కోడ్ అమల్లో ఉందని కలెక్టర్ వివరించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ ఆగస్టు 6న, నామినేషన్ల స్వీకరణ ఆగస్టు 13వ తేదీ వరకు ఉంటుందని అన్నారు. 14 వ తేదీన స్క్రూటినీ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. స్క్రూటినీ సమయంలో అన్ని సక్రమంగా ఉంటే ఆ నామినే షనును దాఖలు చేయడం జరుగుతుందని, లేనిచో తగిన కారణాలతో నామినేషనును తిరస్కరించడం జరుగుతుందని ఆయన వివరించారు. 16వ తేదీ మధ్యాహ్నం 03.00గం.ల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని, అనంతరం ఎన్నికల బరిలో ఉన్న తుది అభ్యర్థుల వివరాలను నిర్ధారించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆ తదుపరి బ్యాలెట్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని, ఈ ఎన్నికల్లో ఈవిఎంలు ఉండబోవని, బ్యాలెట్ బాక్సులను వినియోగించడం జరుగుతుందని కలెక్టర్ గుర్తుచేశారు. ఆగస్టు 30 వ తేదీ ఉదయం 8.00 గం.ల నుంచి సాయంత్రం 4.00 గం.ల వరకు పోలింగ్ ఉంటుందని, పోలింగ్ కేంద్రాల వివరాలు రెండు రోజుల్లో తెలియజేస్తామని అన్నారు. గతంలో నిర్వహించిన పోలింగ్ కేంద్రాల్లోనే ఈసారి ఎన్నికలు నిర్వహించేలా జిల్లా యంత్రాంగం అభిప్రాయపడుతున్నట్లు వివరించారు. సెప్టెంబర్3న ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందని కలెక్టర్ వెల్లడించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాజకీయ పక్షాలు, సంబంధిత శాఖల అధికారులందరూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పనిసరిగా పాటించాల్సిందిగా ఆయన కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్,. ఇన్ ఛార్జ్ జిల్లా రెవిన్యూ అధికారి టి.సీతారామమూర్తి, వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు ప్రథమ టీకా

విశాలాంధ్ర - ఆనందపురం: ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా అని బిడ్డ జన్మించిన గంటలోపే తల్లిపాలు తాగించాలని ఐసిడిఎస్ పిఓ శ్రీదేవి పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఆగస్టు 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు అవగాహన కార్యక్రమ ప్రారంభ సందర్భంగా సోమవారం ఆనందపురం అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జన్మించిన మొదటి గంటలోపే కేవలం తల్లిపాలు బిడ్డకు జీవ రక్షక బిందువులని, బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తల్లి పసుపు రంగులో ఉన్న చిక్కటి ముర్రుపాలు అమృతం వంటివి అన్నారు. తల్లిపాలు వల్ల అధిక రక్తపోటు, మధుమేహం, స్థూలకాయం వచ్చే అవకాశాలను చాలా మేరకు తగ్గిస్తాయన్నారు. తల్లిపాలు ఇచ్చే వారిలో రొమ్ము గర్భాశయం, అండాశయ క్యాన్సర్ల ప్రమాదం తక్కువగా ఉంటుందన్నారు. మహిళలు పిల్లలకు పాలు ఇవ్వడం వల్ల సౌందర్య అపోహాలు ఉన్నాయని అటువంటివి దూరం చేయాలన్నారు. ఈ సందర్భంగా బలవర్ధకమైన ఆహారా దినుసులను ప్రదర్శించారు. అదేవిధంగా పదిమంది గర్భిణీలకు ఆనందపురం కార్యకర్త కాసులమ్మ శ్రీమంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ కార్యదర్శి రామకృష్ణ నాయుడు, అంగన్వాడి సూపర్వైజర్ వెంకటరత్నం, యంపిపి స్కూల్ హెచ్ఎం అంజలీ దేవి, ఆనందపురం అంగన్వాడీ కార్యకర్త దొంతల కాసులమ్మ, పాలవలస అంగన్వాడీ కార్యకర్త పద్మ ధనలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది సౌందర్య, పైడిరాజు, డి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

21న ఐక్యూ జెడ్9ఎస్ ప్రో 5జీ, జెడ్9ఎస్ 5జీ విడుదల

విశాలాంధ్ర/విశాఖపట్నం: హై పెర్ఫార్మెన్స్ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ ఐక్యూ తన అత్యంత ప్రతిష్టాత్మకమైన ఐక్యూ జెడ్9ఎస్ సిరీస్‌ను 2024 ఆగస్టు 21న విడుదల చేయనుంది. ఐక్యూ 'జెడ్' సిరీస్ ఎప్పుడూ కదిలే యువ మల్టీటాస్కర్‌ల కోసం రూపొందింది. రాబోయే ఐక్యూ జెడ్ 9ఎస్ సిరీస్ 'ఫుల్లీ లోడ్ ఫర్ ది మెగాటాస్కర్స్ ప్రధానంగా కళాశాల విద్యార్థులు, యువ నిపుణులు పని/అకడమిక్స్, సామాజిక జీవితం, పాఠ్యేతర కార్యకలాపాలను సమతుల్యం చేస్తున్నారు. ఐక్యూ జెడ్ 9ఎస్ ప్రో 5జి స్నాప్‌డ్రాగన్ 7 జెన్ 3 ప్రాసెసర్తో పనిచేస్తుంది. ఆకట్టుకునే 8 ఎల్ం అన్టూ స్కోర్‌ను సాధిస్తుంది. ఇది సెగ్మెంట్ వేగవంతమైన కర్వ్ స్మార్ట్ ఫోన్ ఐక్యూ జెడ్9ఎస్ 5జీ మీడియాటెక్ డైమెన్సిటీ 7300 ద్వారా పనిచేస్తుంది. 7ఎల్+ యాన్టుటు స్కోరును సాధిస్తుంది. ఐక్యూ జెడ్9ఎస్ ప్రో 5జీ, ఐక్యూ జెడ్9ఎస్ 5జీ రెండిరటిలోనూ ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ (ఓఐఎస్)తో కూడిన 50 మెగాపిక్సెల్ సోనీ ఐఎంఎక్స్882 సెన్సార్, ఓఐఎస్తో 4కే వీడియో రికార్డింగ్, సూపర్ నైట్ మోడ్ ఉన్నాయి. ఐక్యూ జెడ్9స్ ప్రో 5జీలో అదనంగా 8 మెగాపిక్సెల్ అల్ట్రా-వైడ్ లెన్స్ ఉంది. ఇది సృజనాత్మక అవకాశాలను విస్తృత దృష్టితో విస్తరించడానికి రూపొందింది. ఈ కెమెరా ఫీచర్లు అసాధారణమైన ఫోటో, వీడియో నాణ్యతను అందిస్తాయి.

ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషీన్‌లను విడుదల చేసిన బిఎస్ హెచ్ హోమ్ అప్లయెన్సెస్

విశాలాంధ్ర - విశాఖపట్నం: గృహోపకరణాల పరిశ్రమలో అంతర్జాతీయంగా అగ్రగామి అయిన బిఎస్ హెచ్ హోమ్ అప్లయెన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ , 'మేడ్-ఇన్-ఇండియా' బాష్, సిమెన్స్ ఫ్రంట్-లోడింగ్ వాషింగ్ మెషీన్‌ల యొక్క సరికొత్త శ్రేణిని పరిచయం చేసింది. 9-10 కిలోల లోడ్‌లను నిర్వహించగల సామర్థ్యం తో ??అధునాతన శక్తి సామర్థ్యం మరియు అత్యాధునిక సాంకేతికత కలిగిన ఈ వాషింగ్ మెషీన్లు ఖచ్చితత్వం మరియు శక్తితో అన్ని లాండ్రీ అవసరాలను తీర్చడానికి రూపొందించబడ్డాయి. సిల్వర్, డార్క్ గ్రే మరియు డార్క్ లేక్ యొక్క ఆకర్షణీయమైన రంగులలో అందుబాటులో ఉన్న ఈ మెషీన్‌లు చక్కటి పనితీరును అందించడమే కాకుండా మీ లాండ్రీ ప్రాంగణానికి అధునాతనతను జోడిస్తాయి. భారతీయ కుటుంబాలు అభివృద్ధి చెందుతున్నందున, వారి లాండ్రీ అవసరాలు కూడా పెరుగుతున్నాయి. అధిక సామర్థ్యం గల వాషింగ్ మెషీన్‌లకు, ప్రత్యేకంగా 9 కిలోలు మరియు 10 కిలోల మోడళ్లకు డిమాండ్ గణనీయంగా పెరుగుతోంది.

ఈ మార్పు ప్రధానంగా వారాంతంలో వాషింగ్, వాష్ సైకిళ్ల సంఖ్యను తగ్గించాలనే కోరిక మరియు కర్టెన్‌లు, బెడ్‌షీట్‌లు, తువ్వాళ్లు మరియు బొంతలు వంటి భారీ లోడ్‌లను నిర్వహించాల్సిన అవసరం వంటి వినియోగదారుల ట్రెండ్‌ల ద్వారా నడపబడుతుంది. 2022 నుండి 2023 వరకు, 9 కిలోల ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషీన్‌ల మార్కెట్ 70 శాతం పైగా ఆకట్టుకునే వృద్ధిని సాధించింది.

సామ్‌సంగ్ 'సాల్వ్ ఫర్ టుమారో' ఆధ్వర్యంలో ఎనేబ్లింగ్ పీపుల్

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఒలింపిక్, పారా ఒలింపిక్ గేమ్స్అభిమానులతో సహా ప్రజల కోసం ఒక కొత్త డిజిటల్ కమ్యూనిటీని ప్రారంభించడానికి, ప్రోత్సహించడానికి ప్రపంచవ్యాప్త ఒలింపిక్, పారా ఒలింపిక్ స్మార్ట్‌ఫోన్ భాగస్వామి అయిన సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ జూలై 31న పారిస్‌లో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసి)తో కలసి"టుగెదర్ ఫర్ టుమారో, ఎనేబ్లింగ్ పీపుల్" అనేకార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమం పారిస్ 2024 నిర్వహించబడుతున్న పారిస్‌లోని మల్టీ యూజ్ ఎగ్జిబిషన్ స్పేస్ అయిన స్పాట్24లో జరిగింది. ఐఒసిప్రెసిడెంట్ థామస్ బాచ్, ఐఒసి టెలివిజన్ మార్కెటింగ్ సర్వీసెస్ ఎండీ అన్నే- సోఫీ వోమర్ద్, పారాలింపిక్ కమిటీ (ఐపిసి) ప్రెసిడెంట్ ఆండ్రూ పార్సన్స్, సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్గ్లోబల్ మార్కెటింగ్ ఆఫీస్ ప్రెసిడెంట్, హెడ్ వైహెచ్లీ, సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ యూరప్ ఆఫీస్ ప్రెసిడెంట్ - క్యుంగ్ సంగ్, గతంలో గోల్డ్ మెడల్ గెలుచుకున్న ఫ్రెంచ్ హ్యాండ్‌బాల్ ఆటగాడు, నిష్ణాత విజువల్ ఆర్టిస్ట్,ఒలింపిక్ మ్యూజియం ఫర్ పారిస్ 2024సారథ్యం వహించిన ఒలింపియన్ ఆర్టిస్ట్స్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న లక్ అబాలో కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. టీమ్ కొరియా వాలీబాల్మాజీ ఆటగాడు యోన్ కౌంగ్ కిమ్, టీమ్ జీబీస్కేట్‌బోర్డర్ ఆండీ మెక్‌డొనాల్డ్, ఆస్ట్రేలియన్ పారాఅథ్లెట్ మాడిసన్ డి రోజారియో, యూకే కంటెంట్ సృష్టికర్త, ర్యాపింగ్ సైన్స్ టీచర్మాట్ గ్రీన్ ఈ ప్రాజెక్ట్‌లో ప్రపంచ ప్రచారకర్తలుగా పాల్గొనబోతున్నారు.టుగెదర్ ఫర్ టుమారో, ఎనేబ్లింగ్ పీపుల్‌కు సంబంధించి కోసం కంటెంట్‌నుసోషల్ మీడియా ద్వారా చురుకుగా షేర్ చేయనున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఒలింపిక్, పారాలింపిక్ అభిమానులకు ఒలంపిక్ ఉద్యమంలో అనుభవం పొందడానికి మరియు పాలువంచుకోవడంలో సహాయపడటానికి "టుగెదర్ ఫర్ టుమారో, ఎనేబ్లింగ్ పీపుల్" ప్రాజెక్ట్ సామ్‌సంగ్, ఐఒసిద్వారా అభివృద్ధి చేయబడింది. ఈ కార్యక్రమం ముఖ్యంగా యువతరంపై దృష్టి సారించింది. ఇందులో పాల్గొనేయువతకు "ఒలింపిక్ విలువల స్ఫూర్తి వెలుగులోసాల్వ్, మూవ్ మరియు క్రియేట్"లో సహాయపడే లక్ష్యంతో ఈ కొత్త కమ్యూనిటీ రూపొందించబడింది. "టుగెదర్ ఫర్ టుమారో, ఎనేబ్లింగ్ పీపుల్" మూడు కొత్త కమ్యూనిటీఆధారిత కార్యక్రమాలను ప్రవేశపెట్టింది.

ఎమ్మెల్యే పల్లాను అభినందించిన జీవీఎంసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుని సోమవారం జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలుపుతూ, మన నగరాన్ని మరింత అభివృద్ధి చేయడానికి మీయొక్క సహాయ సహకారాలు ఉండాలని సూచించారు. త్వరలో జీవీఎంసీ పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలతో జీవీఎంసీ కాంట్రాక్టర్లకు సమావేశము ఏర్పాటు చేయాలని అధ్యక్షులు గొంప చంద్రమౌళి కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గొంప చంద్రమౌళి, కార్యదర్శి రంధి సాధురావు, ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి, ఆర్‌పి నాయుడు, కన్వీనర్ రాజన వెంకటరావు, జాయింట్ సెక్రటరీ గణేష్, మెంబర్లు సూర్యనారాయణ, పెద్దఎత్తున కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

అభివృద్ధిపై అధికారులతో సమీక్ష

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని గ్రామపంచాయతీ అభివృద్ధిపై ఎన్ఐఆర్‌డి ప్రతినిధి సమీక్ష సమావేశం నిర్వహించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ ప్రతినిధి కే.నాగరాజు పాల్గొని మాట్లాడుతూ పల్లెటూరులే పటకొమ్మలని గ్రామపంచాయతీ అభివృద్ధి లక్ష్యాలు ఏ విధంగా జరుగుతున్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో మౌలిక వసతులు కల్పన దిశగా ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నీలం అప్పలనాయుడు, ఈవోపీఆర్డి రామారావు, మండల ఇంజనీరింగ్ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రాజెక్టు అధికారి కే రాజేష్, గ్రామ కార్యదర్శులు శ్రీరామ్మూర్తి, ఎం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలపై తహశీల్దార్‌కు వినతి

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో 276, 305, 306, సర్వే నెంబర్లలో అక్రమంగా నిర్మించిన సుమారు 150 పైగా ఇళ్ల స్థలాలు దురాక్రమణకు గురయ్యాయని తహశీల్దార్ శ్యాం ప్రసాద్‌కు సోమవారం టీడీపీ నేతలు వినతిపత్రం సమర్పించారు. అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై పూర్తి దర్యాప్తు జరిపి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మీసాల సత్యనారాయణ, రామారావు, కోయ్యనాని, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బొత్స సత్యనారాయణకు అభినందనలు తెలిపిన మండల వైసిపి నాయకులు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం వైసీపీ మండల నాయకులు ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఇటీవల ఎలక్షన్ కమిషనర్ విశాఖపట్నంలో ఖాళీగా ఉన్న ఒక ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు నిర్వహిస్తున్నట్టుగా తెలియజేశారు. వైఎస్ఆర్సిపి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఎమ్మెల్సీ

స్థానానికి అర్హుడు బలమైన అభ్యర్థి బొత్స సత్యనారాయణ ప్రకటించడంతో పార్టీ క్యాడర్లో నూతన ఉత్సాహం పెరిగిందని మండల నాయకులు ఆయనను కలిసిన సందర్భంగా తెలియ జేశారు. జడ్పిటిసి కోరాడ వెంకట్రావు, మండల పార్టీ ప్రెసిడెంట్ బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు,వైస్ ఎంపీపీ పాండ్రంగి శ్రీను, బొట్ట రామకృష్ణ, రౌతు శ్రీను, కనకరాజు, అప్పలనాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు.

భీమిలి, కాపులుప్పాడ డంపింగ్ యార్డులను పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ పి.సంపత్ కుమార్ భీమిలి జోన్ డంపింగ్ యార్డ్, కాపులుప్పాడ డంపింగ్ యార్డ్ బయోమైనింగ్ ప్లాంటును సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భీమిలి డంపింగ్ యార్డ్‌లో ముందుగా గార్బేజ్ క్లోజ్ కంప్రెషన్ మిషన్ పనితీరును పరిశీలించి, భీమిలి డంపింగ్ యార్డ్ వద్ద వర్మీ కంపోస్ట్, విండ్రోస్ కంపోస్ట్ కేంద్రాలను సందర్శించి వర్మీ కంపోస్ట్ కేంద్రంలో పలు పైపులను మార్చాలని జోనల్ కమిషనర్‌కు ఆదేశించారు. అనం తరం రాసా ఇన్ఫ్రా సంస్థ తయారుచేసిన మొబైల్ కాంపాక్టర్ బిన్ పనితీరును పరిశీలించిన కమిషనర్ క్లాప్ వాహనాల ద్వారా వచ్చిన వ్యర్థాలను నేరుగా మొబైల్ కాంపాక్టర్ బిన్‌లో వేసే పద్ధతిని పరిశీలించి, నగరంలో వ్యర్థాల తరలింపుకు వీలుగా ఈ మొబైల్ కాంపాక్టర్ బిన్‌ను సవరించాలని పర్యవేక్షక ఇంజినీరు (మెకానికల్) కృష్ణరావుకు పలు సూచనలు చేశారు. తదుపరి తగరపు వలస వద్ద జరుగుచున్న అన్న క్యాంటీన్ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, భీమిలి జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మికి కమిషనర్ ఆదేశించారు. అనంతరం కాపులప్పాడ డంపింగ్ యార్డ్ నందు జరుగుచున్న బయో మైనింగ్ ప్లాంట్ ను పరిశీలించిన అనంతరం జిగ్మా సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతూ ప్లాంట్ నందు లెగసి వేస్ట్ ఎక్కువగా ఉందని త్వరగా లెగసి వేస్ట్ తగ్గిస్తూ సమస్యను పరిష్కరించినట్లయితే, 2024 స్వచ్ఛ సర్వేక్షన్ లో గార్బేజ్ ఫ్రీ సిటీ ర్యాంకింగ్ నందు సెవెన్ స్టార్ రేటింగ్ జీవీఎంసీకి దక్కడం ద్వారా ఉత్తమ ర్యాంకును విశాఖపట్నం దక్కించు కుంటుందని వారికి తెలిపారు. ఇండోర్ సిటీకి లెగసీ వేస్ట్ లేనందున స్వచ్ఛ సర్వేక్షన్ లో వరుసగా ప్రథమ స్థానం లభిస్తుందని, విశాఖ నగరంలో కూడా లెగసి వేస్ట్ పూర్తిగా లేకుండా చేసినట్లయితే ప్రథమ స్థానం విశాఖ నగరానికి దక్కుతుందని ఆ దిశగా సంస్థ ప్రతినిధులు దృష్టి సారించేటట్లు త్వరితగతిన లెగసీ వేస్ట్ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని పర్యవేక్షక ఇంజనీరు మెకానికల్ కృష్ణారావుకు కమిషనర్ ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ వినయ్ కుమార్, రెండవ జోనల్ కమిషనర్ శైలజ వల్లి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, ఇఇ మెకానికల్ దిలీప్, సహాయ వైద్యాధికారి డాక్టర్ ఎన్. కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్‌లో జాతీయ మీడియా సదస్సును జయప్రదం చేయండి

- పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: రాజస్థాన్లోని మౌంట్ అబూలో సెప్టెంబరు 26 నుంచి 30వ తేదీ వరకు బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మీడియా మీడియా సదస్సును జయప్రదం చేయాలని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. సోమవారం వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజానికి ఆధ్యాత్మిక ధోరణిలో బ్రహ్మ కుమారీస్ సంస్థ అందిస్తున్న సేవలు అమోఘం అన్నారు. విశాఖ నుంచి జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని ఆయన కోరారు. అనంతరం నిర్వాహకులు ఆయనను, ఇతర అతిథులను శాలువ, జ్ఞాపిక లతో ఘనంగా సత్కరించారు. బ్రహ్మ కుమారీస్ సంస్థ ప్రతినిధి రామే శ్వరి మాట్లాడుతూ రాజస్థాన్‌లో గల మౌంట్ అబూలో ప్రజాపిత బ్రహ్మ కుమారి ఈశ్వరియ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ ముఖ్య కేంద్రంలో జాతీయ మీడియా సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. దేశం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొంటున్న ఈ సదస్సులో విశాఖ జర్నలిస్టులు అత్యధికంగా పాల్గోవాలని ఆమె కోరారు. సదస్సులో ఆరోగ్యం, ఆధ్యాత్మికత, మెడిటేషన్‌పై అవగాహన కల్పిస్తారని తెలిపారు. విశాఖలో గల ప్రింట్, ఎలక్ట్రానిక్, వెబ్ చానల్స్ మీడియా ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామన్నారు. మానసిక, శారీరక దృఢత్వం కోసం సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. ఈ సదస్సులో రాజయోగ ధ్యానం, తదితర క్లాసులు జరుగుతాయన్నారు. సెప్టెంబర్ 27న ఆరోగ్యకర - సంతోష కర సమాజం ఆధ్యాత్మిక సాధికారత - మీడియా పాత్ర అంశం మీద జాతీయ సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు. 28 న పాజిటివ్, నెగెటివ్ డ్యిమెన్షన్ ఆఫ్ సోషల్ మీడియా అంశం మీద ప్లీనరీ సెషన్ వుంటుందన్నారు. న్యాయమూర్తులు, మీడియా ప్రతినిధులకు పలు అంశాలు మీద సెషన్లు వుంటాయని తెలిపారు. ఆధ్యాత్మిక ఉన్నతితో పాటు, క్రమశిక్షణతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. సెప్టెంబర్ 24న విశాఖలో మీడియా ప్రతినిధులు బృందం రైలులో రాజస్థాన్ బయలు దేరుతారని తెలిపారు. సెప్టెంబర్ 29న అక్కడ పలు ప్రాంతాలకు సైట్ సీయింగ్ కూడా వుంటుందన్నారు. బ్రహ్మ చేత తపస్సు చేయించిన మౌంట్ అబూ పరమ శివుని ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతుందన్నారు. ఈ నెల 3న జాతీయ అవయవ దాన దినోత్సవం జరిగిందని గుర్తు చేశారు. దేశంలో మధుమేహం కారణంగా కిడ్నీ తదితర వ్యాధులు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు అవయవ దానం కోసం ముందుకు రావాలని కోరారు. దానం చేసే వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వం రూ.10 వేల ఆర్థిక సాయం చేస్తుందన్నారు. బ్రహ్మ కుమారీ సంస్థ సభ్యులు కూడా అవయవ దానం చేసారని గుర్తు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఆధ్యాత్మిక శక్తి కేంద్రం బ్రహ్మకుమారీ సంస్థ పేరు గాంచిందన్నారు. బ్రహ్మ కుమారీ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా 142 దేశాల్లో ఆధ్యాత్మిక ప్రచారం చేస్తున్నారన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ సీతల్ మాట్లాడుతూ జాతీయ అవయవ దానం దినోత్సవం సందర్భంగా మూడు లక్షల మంది రోగులు అవయవాలు కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ప్రజలు అవయవదానం కోసం ముందుకు రావాలని కోరారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుభాబు మాట్లాడుతూ బ్రమకుమారిస్ సంస్థ ఏటా జాతీయ మీడియా సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న విషయాలు ఈ సదస్సులో చర్చిస్తారన్నారు. అక్కడికి వెళ్ళిన వారు దివ్యానుభూతికి లోనవుతున్నారని తెలిపారు. ఇది దేవ దూత ఆహ్వానంగా భావించాలని కోరారు. ప్రముఖ కొరియోగ్రాఫర్, సీనియర్ జర్నలిస్టు నాగరాజు పట్నాయక్ మాట్లాడుతూ జర్నలిస్టులకు శిక్షణ కోసం ఏటా బ్రహ్మ కుమారీ సంస్థ సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆరోగ్యం, ఆనందంతో కూడిన సమాజం చూడాలంటే మీడియా పాత్ర ఏమిటన్నది ఈ సదస్సులో చర్చిస్తారన్నారు. విశాఖ జర్నలిస్టులు ఈ సదస్సు విజయవంతం చేయాలని కోరారు. ఏఎంసీ అనాటమీ హెచ్‌ఓడి డాక్టర్ లక్ష్మణ్ రావు మాట్లాడుతూ అవయవ దానం కోసం ప్రజలు ముందుకు రావాలన్నారు. బ్రహ్మ కుమారీ సంస్థ ఈ విషయంలో ఎంతో కృషి చేశారని కొనియాడారు. మీడియా సమావేశంలో బ్రహ్మ కుమారీ సంస్థ సభ్యులు సిద్దు, మురళీకృష్ణ, సునీత, నారాయణ, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రారంభం కానున్న యూనికామర్స్ ఈ సొల్యూషన్స్ లిమిటెడ్ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్

విశాలాంధ్ర - విశాఖపట్నం: యూనికామర్స్ ఈసొల్యూషన్స్ లిమిటెడ్ ప్రతిపాదిత ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ 2026 ఆగస్టు 6న ప్రారంభమై 2024 ఆగస్టు 8న ముగియనుంది. ఈ ఇష్యూలో భాగంగా 2,56,08,512 వరకు షేర్లను ఆఫర్ ఫర్ సేల్ విధానంలో విక్రయించనున్నారు. ప్రమోటర్ సెల్లింగ్ షేర్‌హోల్డర్ ఏస్‌వెక్టార్ లిమిటెడ్ (గతంలో స్నాప్‌డీల్ లిమిటెడ్) 94,38,272 వరకు షేర్లను, ఇన్వెస్టర్ సెల్లింగ్ షేర్‌హోల్డర్ అయిన ఎస్‌బీ ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్స్ 1,61,70,240 వరకు షేర్లను విక్రయించనున్నాయి. ఈ ఆఫర్‌కి ఐఐఎఫ్‌ఎల్ సెక్యూరిటీస్, సీఎల్ఎస్ఏ ఇండియా సంస్థలు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి. సెల్లింగ్ షేర్‌హోల్డర్లు 2,56,08,512 వరకు షేర్లను విక్రయించడం, బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో షేర్లను లిస్ట్ చేయడం ద్వారా వచ్చే ప్రయోజనాలను పొందడం ఇష్యూ ప్రధాన లక్ష్యాలని సంస్థ ప్రతినిధి వెల్లడించారు.